క్లుప్తంగా

ఈ-కేవైసీ పూర్తి చేయాలి

ముప్పాళ్ళ: మండలంలోని గ్రామాల్లో ఈ-కేవైసీ నమోదు కాని రేషన్ కార్డుదారులు ఈ నెలాఖరులోపు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో చెప్పారు. మండలంలో మొత్తం 37,389 రేషన్ కార్డులకు గాను ఇంకా 222 కార్డుదారుల ఈ-కేవైసీ నమోదు పెండింగ్ ఉందన్నారు. గడువులోపు నమోదు కాకుంటే రేషన్ నిలిచిపోతుందన్నారు. కార్డులోని కుటుంబ సభ్యులందరూ ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు క్రీడా వేదిక ప్రారంభం



పెదకూరపాడు : పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక నేత ఆర్తి మల్ల రమేష్ తన సతీమణి నళిని జ్ఞాపకార్థం సొంత నిధులతో ఏర్పాటు చేసిన క్రీడా వేదికను బుధవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ మంగళవారం తెలిపారు. క్రీడాకారులకు అనువుగా క్రీడా వేదికను నిర్మించినట్లు పేర్కొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

పెదకూరపాడు : పెదకూరపాడులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో కాటూరు మెడికల్ ఆసుపత్రి ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోమయాజులు మంగళవారం తెలిపారు. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీ తదితర వ్యాధులకు సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొనే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకొని రావాలని కోరారు.

దివ్యాంగులకు నివేశన స్థలాలు కేటాయించాలి



మాచర్ల రూరల్: పట్టణంలో ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్న దివ్యాంగులకు రవాణా సౌకర్యం కలిగిన ప్రాంతాల్లో నివేశన స్థలాలు కేటాయించాలని అబ్దుల్ కలాం సేవా సమితి, వికలాంగుల సేవా సమితి నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మానసికంగా, శారీరకంగా దివ్యాంగులుగా ఉన్న వారికి నివేశన స్థలాల ఏర్పాటులో ప్రత్యేక దృష్టి సారించాలని, గుంటూరు రోడ్డులోని చెన్నకేశవ స్వామి మాన్యం, మందాది, సాగర్ ప్రధాన రహదారి ప్రాంతంలో స్థలాన్ని మంజూరు చేసి నివాస గృహాల ఏర్పాటులో తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్‌ను కోరారు. అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షుడు షేక్ పాషావలి, వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు షేక్ అన్వర్ బాషా, పి.అంజిబాబు, శంకర్, నాగేశ్వరరావు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికి రీసర్వే దోహదం

మాచర్ల రూరల్: భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు భూ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని రాయవరం గ్రామంలో భూ సర్వే పై రైతులతో అవగాహన కల్పించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వే రైతులకు ఎంతో ఉపయోగకరమని, ఎన్నో సంవత్సరాల నుంచి పరిష్కారం కాని భూముల సరిహద్దు వివాదాలు, మార్పులు చేర్పులు చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రైతులు రీ సర్వే పై అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఆర్ఐ అనిల్ కుమార్, సర్వేయర్ ఆదినారాయణ, వీఆర్ఓలు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

గురజాల: స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో మంగళవారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామానికి చెందిన శివతేజ లైటింగ్ అండ్ డెకరేషన్ నిర్వాహకుడు అంబిరాజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కటికల నాగేశ్వరరావు, బండి రవికుమార్, కనకం హనుమంతరావు తదితరులున్నారు.



జనం నెత్తిన అధనపు భారం

- గ్యాస్ ధర పెంపు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలంటున్న గృహిణులు
- ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతం
- నియోజకవర్గంలో 50 వేల మందికి పైగా వినియోగదారులు



అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరతో నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాల నెత్తిన పెనుభారం పడింది. రూ.50 పెంచడంతో ఇప్పటివరకు రూ.870 ఉన్న సిలిండర్ ధర రూ.920కు పెరిగింది. కూటమి సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకం ద్వారా అర్హులందరికి ఇవ్వకపోగా గ్యాస్ ధర పెంచి అన్ని వర్గాలపై భారం మోపడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం పేరుతో గ్యాస్ సిలిండర్ ధర ఈ విధంగా పెంచుతూ పోతుండటంతో మధ్య తరగతి వారిపై కూడా మోయలేని భారం పడుతూనే ఉంది. ధరలను అదుపులో పెట్టాల్సిన ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు తలెత్తున్నాయి. మరో వైపు గ్యాస్‌పై సబ్సిడీ కూడా గాలికి వదిలేశారు.

50 వేల మందికి పైగా వినియోగదారులు

పెదకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, పెదకూరపాడు, బెల్లంకొండ మండలాల్లో 50 వేలకు పైగా గ్యాస్ వినియోగదారులున్నారు. ఒక్కొక్కరు సగటున రెండు నెలలకు ఒక సిలిండర్ చొప్పున వాడుకున్నా ఏడాదికి ఆరు సిలిండర్లు అవసరమవుతాయి. ఈ లెక్కన ఒక్కొక్క వినియోగదారు నెత్తిన ఏడాదికి రూ.300 అదనపు భారం పడుతుంది. 50 వేల వినియోగదారులపై ఏడాదికి రూ.1.5 కోట్ల భారం పడనుంది. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉండగా కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర రూ.50 పెంచితే ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించే విధంగా జీవో జారీ చేశారు. అదే విధంగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం భరించాలని వినియోగదారులు కోరుతున్నారు. ఇప్పటికే గ్యాస్ ధర కంటే డెలివరీ సమయంలో రవాణా పేరుతో వినియోగదారుల నుంచి రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దానికి తోడు కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.50 సరికొత్త బాదుడుగా మారింది.

పెరిగిన నిత్యావసరాల ధరలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా బాదుడే బాదుడంటూ ఊరూర ఊదర గొట్టిన నాయకులు, ధరలు నియంత్రించడంలో ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు రెండు సార్లు, రిజిస్ట్రేషన్ చార్జీలు సామాన్యుడు మోయలేనంతగా పెంచారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇక నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విధంగా ధరలు పెరగడాన్ని ఏమనాలని విమర్శలు వినిపిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి



కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై పెంచిన రూ.50 రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. గతంలో వైఎస్సార్ సీఎంగా ఉండగా ఇలానే చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేస్తేనే మహిళలకు మేలు జరుగుతుంది. ఇప్పటికే పెరిగిన ధరలతో ఒక్కపూటే తినాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దాదాపు అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి.

– తూమాటి నాగమ్మ, గృహిణి, మాదిపాడు

కట్టెల పొయ్యిని ఆశ్రయించాల్సిందేనేమో



ఒకప్పుడు గ్యాస్ ధర రూ.480 ఉండేది. ఈ ధర రూ.870 అయింది. ఇప్పుడు అదే ధర రూ.920కు పెరిగింది. ఇలా పెంచుకుంటే పోతే కూలీ పనే జీవనాధారంగా జీవిస్తున్న మేము గ్యాస్ ఎలా కొనాలి. మళ్లీ పాత రోజులలో లాగా పొలాల నుంచి వచ్చేటప్పుడు కట్టెలు ఏరుకుని వచ్చి కట్టెల పొయ్యిపై వంటలు వండుకోవాలేమోనని భయమేస్తోంది.

– షేక్ హుస్సేన్‌బి, గృహిణి, మాదిపాడు

మాకు ఒరిగేదేముంది



రూ.320 లున్న గ్యాస్ బండను రూ.870కు పెంచారు. మళ్లీ ఇప్పుడు మరో రూ.50 పెరిగి రూ.920 అయింది. అది మా ఊరికి వచ్చి ఇంటికి చేరే సరికి రవాణా చార్జీ అంటూ మరో రూ.50 అదనంగా తీసుకుంటున్నారు. ఇప్పుడు గ్యాస్ సిలిండర్ కొనాలంటే రూ.970 అవుతుంది. మూడు సిలిండర్లు ఇస్తామంటున్నారు. మిగిలిన ఆరు సిలిండర్లు పెరిగిన ధరకు కొనాల్సిందేగా.. ఇక మాకు ఒరిగేదేముంది.

– బోద పద్మ, మాదిపాడు



బాగు చేయండి సారు..

అసలే వేసవికాలం.. భూగర్భ జలాలు అంతంత మాత్రం.. నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులకు నోచుకోక నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పెద్దకూరపాడులోని ఎస్సీ కాలనీ క్రీస్తు లూథరన్ దేవాలయం వద్ద ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన చేతి పంపు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చుట్టుపక్కల వారి నీటి అవసరాలు, దేవాలయాలకు వచ్చే భక్తుల అవసరాలు తీర్చే చేతిపంపును బాగు చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

పెదకూరపాడు

ప్రజా చైతన్యంతో అగ్ని ప్రమాదాల నియంత్రణ సాధ్యం

అగ్నిమాపక అధికారి సుబ్బారావు



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక అధికారి

సత్తెనపల్లి: ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించడం సాధ్యమని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, తాలూకా సెంటర్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో మంగళవారం వారోత్సవాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కరపత్రాలను ముఖ్యమైన ప్రాంతాల్లో అంటించి అగ్నిమాపక వారోత్సవాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి సుబ్బారావు మాట్లాడుతూ ఎక్కువగా అగ్ని ప్రమాదాలు అజాగ్రత్త వల్లే సంభవిస్తాయని, అగ్ని ప్రమాదాలపై ప్రజలకు కనీస అవగాహన కల్పిస్తే చాలా వరకు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు అన్ని వర్గాల ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ లీడింగ్ ఫైర్ మాన్ ఆలా శ్రీనివాసరావు, డ్రైవర్ ఆపరేటర్ సీహెచ్ సాగర్ బాబు, ఫైర్ మాన్‌లు ఎం.మోహన్ బాబు, బి.నాగేశ్వరరావు, ఎస్కే బాజ్జి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

మండల ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్



ఆయుర్వేద మందులను పంపిణీ చేస్తున్న వైద్యులు శ్రీనివాస్

బెల్లంకొండ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని మండల ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓసీ అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ పక్వాడా' పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు తృణ ధాన్యాలు, ఆకుకూరలు, సీజన్లో దొరికే పండ్లు ఆహారంగా తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే బాలామృతాన్ని క్రమం తప్పకుండా తినాలని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న బాలింతలు, గర్భిణులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం వడదెబ్బ నివారణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ, అంగన్‌వాడీ కార్యకర్త ఆయేషా, యోగా టీచర్ కోటేశ్వరమ్మ, వెంకటరామయ్య పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

జిల్లా రెవెన్యూ అధికారి ఈ మురళి



అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా అధికారులు

రాజుపాలెం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి ఈ మురళి అన్నారు. మండలంలోని మొక్కపాడు గ్రామం ఎస్సీ కాలనీలోని లూథరన్ చర్చి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి ఈ మురళి, జిల్లా ఇరిగేషన్ అధికారి సీహెచ్ ఆంజనేయులు, గుంటూరు జిల్లా నోడల్ అధికారి కొండా సంజీవరావు, రిటైర్డ్ డీఎస్పీ రవికుమార్‌లు సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలు, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో అంబేడ్కర్ యూత్ సభ్యులు కాలనీలో పది అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విగ్రహదాత కలేకూరి వెంకటప్పయ్యను అభినందించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ ప్రెసిడెంట్ కలేకూరి యోగినాథ్, సర్పంచ్ కణదం శ్రీను, ఎంపీటీసీ ఎస్కే హుస్సేన్, యూత్ సభ్యులు కలేకూరి దాసు, కలేకూరి పెద్ద జోసఫ్, కలేకూరి చిన్న జోసఫ్, నేలటూరి నరసింహారావు, నేలటూరి భాగ్యరాజు, కలేకూరి సాగర్, కాలనీవాసులు పాల్గొన్నారు.



కోతుల నుంచి రక్షించండి మహాప్రభో..!

మండలంలోని రెడ్డిగూడెంలో కోతుల బెడద అధికంగా ఉంది. కోతుల వలన గ్రామస్తులు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. గుంపులు గుంపులుగా ఇళ్లలోకి చొరబడి ఇష్టానుసారంగా వస్తువులను పగులగొడుతూ కావాల్సిన ఆహార పదార్థాలను తీసుకెళుతున్నాయి. ఇళ్లలో వస్తువులను చెల్లాచెదురు చేస్తున్నాయి. మహిళలపై ఎగబడుతున్నాయి. మహిళలు, చిన్నపిల్లలు కోతుల దెబ్బకు భయపడి పరుగులు తీసే సమయంలో రోడ్లపై పడి దెబ్బలు తగిలిన వారు చాలా మంది ఉన్నారు. వీటికి తోడు కుక్కల బెడద కూడా తోడవడంతో గ్రామస్తులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. కుక్కలు చిన్న పిల్లలపై ఎగబడుతూ కరుస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కోతులు, కుక్కల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజుపాలెం

వివేకానంద ఆశ్రమ సేవలు అభినందనీయం



మాచర్ల రూరల్: రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, స్వామి వివేకానంద సేవా ఆశ్రమంలో ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులను ఏర్పాటు చేయటం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని స్వామి వివేకానంద సేవా ఆశ్రమంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో స్వామి వివేకానంద సేవా సమితి ఏర్పాటు చేసి ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, స్పోకెన్ ఇంగ్లిష్ వంటివే కాకుండా, వేసవి సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేసిన గోవిందరెడ్డి అభినందనీయుడన్నారు. నేటి సాంకేతిక రంగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని, ఇలాంటి శిక్షణను ఉపయోగించుకొని ముందుకు సాగాలని ఆయన కోరారు. కంప్యూటర్ అధ్యాపకులు భారతి, అధ్యక్షులు గోవిందరెడ్డి, టీచర్లు సుచిత, గాయత్రి, భాస్కర్ తదితరులున్నారు.

'గ్రీన్ మాచర్ల' ఏర్పాటుకు కృషి



మాచర్ల రూరల్: పట్టణాన్ని గ్రీన్ మాచర్లగా రూపొందించేందుకు రింగు రోడ్డు నుంచి పార్క్ సెంటర్ వరకు ఉన్న డివైడర్ల పై గ్రాస్ మ్యాట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. మంగళవారం డివైడర్ల పై ఏర్పాటు చేస్తున్న గ్రాస్ మ్యాట్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. స్థానిక కేసీపీ సంస్థ సహకారంతో డివైడర్లపై గడ్డి మ్యాట్లను ఏర్పాటు చేస్తున్నామని, పూల మొక్కలను నాటి పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దేందుకు తాము పనిచేస్తున్నట్లు తెలిపారు. గతంలో వేసిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో గ్రీనరీ ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ పోలూరి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. డివైడర్ల పై ఎటువంటి పోస్టర్లను అంటించరాదని, అలా అంటించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేసీపీ వెల్ఫేర్ ఆఫీసర్, కార్మికులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు

మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: పంటలను సాగుచేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని దీంతో వారికి ఆ భూములలో సూక్ష్మ పోషకాలపై అవగాహన ఉంటుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రెంటచింతల, మిట్టగుడిపాడు గ్రామాలలోని పంటపొలాల్లో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్లయితే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరించారు. ఇనుము, మాంగనీసు, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషియం, క్లోరిన్, గంధకం అనే సూక్ష్మపోషకాలు, భూమిలో సమపాళ్లలో ఉండేలా చూసుకోవడానికి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఎరువులు వాడుకోవాలన్నారు. జీవన ఎరువుల వాడకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సూక్ష్మపోషకాల లోపాల వలన వచ్చే తెగుళ్లను నివారించేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని ఎక్కువ శాతం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచినట్లయితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. వీహెచ్ఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పక్కన డీఈఓ చంద్రకళ, ఆర్డీవో రమణకాంతరెడ్డి

సత్తెనపల్లి: పుట్టుకతోనే చిన్న చిన్న లోపాలతో జన్మించిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం సత్తెనపల్లిలోని ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున ఉపకరణాలను అందించడం అభినందించాల్సిన విషయమన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో 28 భవిత సెంటర్లు ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం నడుస్తున్నాయని, వీటిలో 56 మంది ఐఈఆర్‌పీలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 28 మంది ఆయాలకు గాను 26 మంది పని చేస్తున్నారన్నారు. ఫిజియోథెరపిస్ట్‌లు 9 మందికి గాను ఐదుగురు పని చేస్తున్నారని, మిగిలిన నలుగురి కోసం కూడా ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 223 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులకు రూ.57.70 లక్షలు ప్రభుత్వం నుంచి అలవెన్స్ రూపంలో విడుదలై వారి ఖాతాలకు నేరుగా జమ చేయడం కూడా జరిగిందన్నారు. ఈ సందర్భంగా 45 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఎనిమిది రకాల ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణకాంతరెడ్డి, ఏపీసీ వి.సుబ్బారావు, ఐఈడీ జిల్లా కో ఆర్డినేటర్ సెలవరాజు, సత్తెనపల్లి తహసీల్దారు కేఎస్ చక్రవర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, స్థానిక ఐఈడీ ఉపాధ్యాయులు, ఫిజియోథెరపిస్ట్‌లు తదితరులు ఉన్నారు.

నూర్‌బాషా మస్తాన్ అకాల మరణం పార్టీకి తీరనిలోటు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ క్రియాశీలక నాయకుడు నూర్‌బాషా మస్తాన్ అకాల మరణం పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 28వ వార్డుకు చెందిన నూర్‌బాషా మస్తాన్ అలియాస్ చెక్క మస్తాన్ (55)కు సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరాడు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి మంగళవారం నూర్‌బాషా మస్తాన్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, దివ్యాంగుల విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు గోర, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ జలీల్, సిటీ కేబుల్ ఖాజా, ఎస్ఎం యూనస్, ఖాజా, రఫీ ఉన్నారు.

బహిరంగ వేలం ద్వారా రూ. 4.03 లక్షల ఆదాయం



బహిరంగ వేలంలో ఈఓ రామిరెడ్డి, రైతులు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన 37.61 ఎకరాల భూములకు స్థానిక శివాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన కౌలు బహిరంగ వేలం ద్వారా రూ. 4.03 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. 8 ఎకరాల మెట్ట భూమిని చింతా రామకృష్ణ రూ.80 వేలకు, 6.73 ఎకరాల మెట్ట భూమిని సన్నెగంటి సిద్దయ్య రూ.92 వేలకు, 8.88 ఎకరాల మాగాణి భూమిని తిప్పాబత్తుల వెంకట సుబ్బయ్య రూ.94 వేలకు, 14 ఎకరాల మాగాణి భూమిని నెవలి పెద్ద నాగిరెడ్డి రూ.1.37 లక్షలకు బహిరంగ వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. గత ఏడాది ఈ భూముల ద్వారా రూ.1.58 లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.4.03 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. దీంతో గత ఏడాది కన్నా ఈ ఏడాది దేవస్థానానికి రూ.2.45 లక్షలు ఆదాయం అదనంగా వచ్చిందన్నారు. కౌలుకు పాడుకున్న వారికి 2025-26 నుంచి 2027-28 వరకు 3 సంవత్సరాల పాటు కౌలు హక్కును పొందటం జరుగుతుందన్నారు. కౌలు హక్కు పొందిన వారు ముందుగానే ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలాఖరులో నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో శివాలయం అధ్యక్షుడు పల్లెర్ల లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి గ్రామోత్సవం

రెంటచింతల: అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అయప్పస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో రెంటచింతల గ్రామ పురవీధులలో అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులతో మంగళవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. మాచర్లకు చెందిన సైదులు నేతృత్వంలో రెంటచింతలకు చెందిన మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి 8 గంటల నుంచి 11 వరకు అయప్పస్వామి ఊరేగింపు కొనసాగింది. అర్చకుడు వెల్లటూరి నాగేశ్వరశర్మ, గుంటక కాశిరెడ్డి, కె.సైదులు, రాము, వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.